ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
మంగళవారం 18 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	190	210
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 ; కనిష్ఠం 19.0


జాతరలో డోలు వాయిస్తున్న మంత్రి ఉత్తమ్


మదెరపోలు, ముత్యాల పోలు, లగ్గం పోలు నిర్వహిస్తున్న యాదవులు


మొక్కు తీర్చుకుంటున్న మహిళలు

జనమే జనం

కిక్కిరిసిన పెద్దగట్టు


లింగమంతుల స్వామిని దర్శించుకున్న పేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కుటుంబ సభ్యులు


పెద్దగట్టు వద్ద కిక్కిరిసిన జనం

సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు రెండో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. దారులన్నీ జనంతో నిండిపోయాయి. సుమారు ఆరు లక్షల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. సౌడమ్మ, యలమంచమ్మ దేవతలకు భక్తులు జీవాలను బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. మహిళలు గంపలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. దురాజ్‌పల్లి చుట్టు పక్కలా ఐదు కిలో మీటర్ల మేర భక్తులు గుడారాలు ఏర్పాటుచేసి వంట చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి బంధుమిత్రులతో కలిసి ఆరగించారు. కాగా, జాతరలో మూడో రోజు మంగళవారం ఉదయం చంద్ర పట్నం కార్యక్రమం నిర్వహించనున్నారు.

•6లో..


విద్యుత్ దీపాల వెలుగులో గుట్ట ఆలయ వైకుంఠ ద్వారం

యాదగిరీశునికి ఉత్సవ సంబరం

- రేపటి నుంచి 23 వరకు స్వర్ణ గోపుర ఉత్సవ పూజలు
- 23 నుంచి 28 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు
- రేపు స్వాతి నక్షత్రం, గిరిప్రదక్షిణ

•6లో..

కాషాయదళ అసమ్మతికి

అధిష్ఠానం బ్రేక్

- వరుస ఆందోళనలతో ముఖ్యనేతలకు షాకిచ్చిన అసమ్మతివర్గం
- ఇకపై సమష్టి నిర్ణయాలతో ముందుకెళ్దామని నచ్చజెప్పిన సంస్థాగత ప్రధాన కార్యదర్శి
- పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు వచ్చాక సమీక్ష చేస్తారనే భరోసా
- పార్టీ శ్రేయస్సు దృష్ట్యా ఆందోళనలు నిలిపామంటున్న అసమ్మతినాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నియామకంపై చెలరేగిన వివాదానికి అధిష్ఠానం తాత్కాలికంగా బ్రేక్‌వేసింది. అసమ్మతి వర్గం లేవనెత్తిన అంశాలపై తప్పకుండా న్యాయం చేస్తామని, సమష్టి నిర్ణయాలతోనే పార్టీని ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. అసమ్మతి నాయకులతో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జరిపిన చర్చల అనంతరం ఈ మేరకు స్పష్టత వచ్చింది. ఏకపక్ష నిర్ణయాలతో కాకుండా సమష్టిగా నిర్ణయాలు తీసుకునేలా ప్రత్యేక యంత్రాంగాన్ని జిల్లా స్థా యిలో ఏర్పాటు చేస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో అసమ్మతివర్గం నిరసనలకు ఫుల్‌స్టాప్ పెట్టింది.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డిని నియమించడంపై పార్టీలో తీవ్రదుమారం చెలరేగింది. ఆయన నియామకాన్ని వ్యతిరేకించిన అసమ్మతివర్గ నాయకులు నియామకాన్ని పునః సమీక్షించాలనే డిమాండ్‌తో ఆందోళనలు నిర్వహించి అధిష్ఠానానికి ఝలక్ ఇచ్చారు. ఈ సందర్భంగా అసమ్మతివర్గం కీలక అంశాలను లేవనెత్తింది. ఏడాది క్రితం పార్టీలో అంతవరకు ఎలాంటి క్రియాశీలక సభ్యత్వం లేకపోయినా, పార్టీలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎలాంటి పదవి నిర్వహించకపోయినా, వర్షిత్‌రెడ్డిని నేరుగా జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పార్టీ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాజాగా, సంస్థాగత ఎన్నికల్లోనూ పార్టీ జిల్లా అధ్యక్ష నియామకానికి రెండుసార్లు క్రియాశీలక సభ్యత్వంతో పాటు 45 ఏళ్ల పైబడి ఉండాలనే నిబంధన విధించారని, దీనికి విరుద్ధంగా వర్షిత్ ఎంపిక జరిగిందని ఆరోపించారు. ఏడాది క్రితం నుంచి అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న వర్షిత్‌రెడ్డి సీనియర్లు, క్యాడర్‌ను కలుపుకుపోవడం లేదని, ఏకపక్ష నిర్ణయాలతో వెళ్తున్నారంటూ ప్రధానంగా అసమ్మతివర్గం ఆరోపించింది. వర్షిత్ నియామకాన్ని పునః పరిశీలించాలనే డిమాండ్‌తో అధిష్ఠాన ముఖ్యులకు, ఇన్‌చార్జీలకు అంతర్గతంగా తెలియజేయడంతో పాటు బహిరంగంగా ప్రెస్‌మీట్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా నల్లగొండకు కేంద్ర మంత్రి బండి సంజయ్ వచ్చిన సందర్భంలో, పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహిస్తున్నప్పుడే కార్యాలయం ఎదుట నల్లకండువాలు, ప్లకార్డులతో అసమ్మతివర్గం నిరసన తెలిపింది. దీంతో పార్టీ ముఖ్యనేతలు ఆచారి, ప్రేమేందర్‌రెడ్డి ఈ విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేస్తామనే హామీతో ఆ రోజు నిరసనను విరమింపజేశారు. అసమ్మతివర్గ వరుస ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానవర్గం మధ్యేమార్గంగా సంధి ప్రయత్నాలు చేసి, అసమ్మతిని చల్లార్చింది.


నల్లగొండ బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అసమ్మతివర్గ నాయకులు (ఫైల్)

సమష్టి నిర్ణయాలతో ముందుకు

అసమ్మతివర్గ కార్యకలాపాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావించిన బీజేపీ రాష్ట్ర అధిష్ఠానం నాయకులను హైదరాబాద్‌కు పిలిపించి అభిప్రాయసేకరణ చేసింది. పార్టీ సంస్థాగత ప్రధాన

మిగతా 7వ పేజీలో...

కేసీఆర్ నాయకత్వంలో

ప్రజల పక్షాన నిలబడతాం



నల్లగొండ మెడికల్ కళాశాల ఎదుట కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్‌రెడ్డికి గుణపాఠంగా తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు జరిగిన చోట కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించామని తెలిపారు. ఇకనైనా తాము ఏం చేశామో కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరి తరం కాదన్నారు. ఏదో మేలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేస్తే వారి ఆశలను వమ్ము చేసిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్లు పోరాడి తెచ్చుకున్న తెలంగాణను మళ్లీ సమైక్యాంధ్ర పాలకుల చేతిలో పెట్టేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. క్రమక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దూరమవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, నిరంజన్ వలీ, మాలె శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కరీంపాషా, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, అయితగోని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి, మారగోని గణేష్, జమాల్ ఖాద్రీ, పాల్గొన్నారు.

భరోసా పైకం గందరగోళం

- కటాఫ్‌లోనూ పూర్తిగా జమకాని డబ్బులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- సమాధానం చెప్పలేక అధికారులు సతమతం

•7లో..

మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి


'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీల పెంపకాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఎంసీవోలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి ముందుగా బ్యాగుల్లో మట్టి నింపడాన్ని పూర్తిచేయాలని, షెడ్ నెట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏ మొక్కలు ఎంత శాతం పెంచాలో ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రారంభించిన 31 పంచాయతీల మాదిరిగానే, మిగిలిన గ్రామాల్లో జాబితాల పరిశీలనను ఈనెల 20లోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోలు, ఎంఎస్‌వోలు ఈ జాబితాను పరిశీలించాలన్నారు. జాబితా పరిశీలనలో ఎట్టి తప్పు చేయవద్దని ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. 31 గ్రామాలకు సంబంధించి మొదటి జాబితాలో ఆమోదించిన జాబితాను తక్షణమే కలెక్టర్ లాగిన్‌కు పంపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో భాగంగా ముందుగా గుడిసెలు, పూర్తిగా కొత్తగా మార్కింగ్ ఇచ్చిన వాటిని మాత్రమే తీసుకోవాలని, చెల్లింపులు దశలవారీగా ఉంటుందని తెలిపారు. డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో 69లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలి

'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి 25 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనుల మంజూరు, గ్రౌండింగ్, పురోగతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరం లేని చోట పనులు మంజూరైతే రద్దు చేయాలని, ప్రారంభించని చోట వెంటనే మొదలు పెట్టాలని అన్నారు. 'ప్రజావాణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు.


ఫిర్యాదులు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 35 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'డయల్ యువర్ సైబర్ నేస్తం' ద్వారా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన నలుగురు నేరుగా, ఆరుగురు ఫోన్‌కాల్ ద్వారా వారి సమస్యలు వివరించారన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930కి గానీ, సంబంధిత వెబ్‌సైట్‌లోగానీ ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకూ 'డయల్ యువర్‌సైబర్ నేస్తం' నిర్వహిస్తున్నామని, 8712658079 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కేసీఆర్‌ను మించిన ఘనుడు రేవంత్

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


మిర్యాలగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలు ఇవ్వడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను మించిన ఘనుడని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజలతో పాటు ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే బాగుండేదన్నారు. దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించిన ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ పాలనలో ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రాట్యూటీ, అలవెన్స్, పింఛన్ల కోసం పది శాతం కమీషన్ ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్‌సీ ఫండ్ విడుదల చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ అమలు చేయలేదన్నారు. నాణ్యతతో కూడిన విద్యనందించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు విస్తరింపజేసిన ప్రధాని మోదీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అందుకే మహారాష్ట్ర, ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు సాదినేని శ్రీనివాసరావు, సైదిరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎడ్ల రమేష్, సునీతరెడ్డి, నివేదితరెడ్డి, అశోక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

జనమంతా పెద్దగట్టు నిండగా..

● లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు ● స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్, ఎంపీలు రఘువీర్, ఈటల ● ఆరు లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని అంచనా

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు రెండవ రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. జాతర దారులన్నీ జనంతో నిండిపోయాయి. ఇప్పటి వరకు ఆరు లక్షల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన జాతర సోమవారం మధ్యాహ్నం వరకు భక్త జనంతో కిటకిటలాడింది. వాహనాలు బారులు తీరాయి. వేలాది గొర్రె పోతులు, మేకపోతులను సౌడమ్మ, యలమంచమ్మ దేవతలకు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొండపై రక్తం ఏరులై పారింది. పారిశుధ్య చర్యలు చేపట్టారు. మహిళలు తలపై గంపలు పెట్టుకొని గుడిచుట్టూ నృత్యాలు చేస్తూ ప్రదక్షణలు చేశారు. యాదవులు సంప్రదాయ బద్ధంగా గజ్జెల లాగులు ధరించి, కటారీ విన్యాసాలు చేస్తూ బేరీలు మోగిస్తూ ఓ లింగా.. ఓ లింగా అంటూ నామస్మరణం చేస్తూ భక్తి పరవశ్యంతో ఊగిపోయారు. మహిళలు పూనకాలతో ఊగిపోయారు. వారిని ఆపడం బంధువులకు కష్ట సాధ్యమైంది. అనేక మంది భక్తులు కొండ పైన తలనీలాలు సమర్పించారు. దురాజ్‌పల్లి చుట్టు పక్కలా ఐదు కిలో మీటర్ల చుట్టూ ట్రాక్టర్లు, గుడారాలు వేసుకొని వంట చేసుకున్నారు. దురాజ్‌పల్లి, కాశీంపేట, పాత కలెక్టరేట్ వరకు జనసందడి కనిపించింది. .



పెద్దగట్టులో నేడు చంద్రపట్నం

లింగమంతులస్వామి జాతర మూడోరోజైన మంగళవారం ఉదయం చంద్రపట్నం వేస్తారు. యాచకులతో కలసి రాజులు, పూజారులు గుడి ప్రాంగణంలో చంద్రపట్నం వేసి భైరవునికి పోలురాస్తారు. ఆదివారం అర్ధరాత్రి కేసారం గ్రామం నుంచి వచ్చిన ఎడ్ల బండ్లేకాక వివిధ వాహనాలు ప్రత్యేక పూజల అనంతరం కేసారానికి తిరుగు ప్రయాణమవుతాయి. చంద్రపట్నం వీక్షించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా హాజరవుతారు.

గుట్టంతా అపరిశుభ్రం

పెద్దగట్టు ఆలయంపై సౌడమ్మలకు వేలాది సంఖ్యలో గొర్రె, మేకపోతులను బలి ఇచ్చారు. గత జాతరలో అపరిశుభ్రం ఈ సారి జరగకుండా జెట్టింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ గుట్టంతా రక్తమయంగా ఉంది. భక్తులు ఇబ్బందులు పడ్డారు.

తలనీలాలు సమర్పించిన భక్తులు

భక్తులు బోనాలు చెల్లించిన తర్వాత తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుట్టపై ఏర్పాటు చేసిన స్నాన కుళాయిల ముందు పుణ్య స్నానాలు ఆచరించారు. తలనీలాలు సమర్పించిన భక్తుల నుంచి రూ.200నుంచి రూ.250ల వరకు వసూలు చేశారు.

కిక్కిరిసిన దుకాణాలు


జాతరకు వచ్చే భక్తులతో తైబజారు దుకాణాలతోపాటు ముఖద్వారం వైపు ఏర్పాటుచేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. భక్తులు తాము భోజనాలు ఏర్పాటు చేసుకున్న దగ్గరకూడా ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన చిన్నా, చితక దుకాణాలు కూడా భక్తులు భారీగా కొనుగోలు చేశారు.

పెద్దగట్టు జాతర

మిఠాయి, చిలకలు, స్వీట్ చాక్‌పీసులు, బొంగులు, పుట్నాలు, చెరుకు, బొంగుముద్దలను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. చిన్న పిల్లల ఆట బొమ్మలు, కంకణాల దుకాణాల్లో కొనుగోలు చేశారు. జాతరలో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. యువతీ, యువకులతోపాటు చిన్న పిల్లలు సైతం ఆనంద పారవశ్యంలో మునిగితేలుతున్నారు. రంగులరాట్నాల్లో యు వత బిజీగా గడుపుతున్నారు. చిన్నపిల్లలు జారుడు ట్యూబ్‌లు, చుట్టు తిరిగే బైక్‌లు, గుండ్రంగా తిరుగుతున్న కార్లు, ట్రైన్‌లలో పిల్లలు జాలీగా తిరు గుతుంటే పక్కనే నిలుచుని తమ తల్లిదండ్రులు ఆనందంలో తేలియాడారు.



పెద్దగట్టు జాతరకు ట్రాక్టర్లపై వెళ్తున్న భక్తులు



ఓ లింగా.. ఓ లింగా









పూజల్లో పాల్గొన్న ఎంపీ బలరాంనాయక్



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్, ఎంపీలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు

దురాజ్‌పల్లి లింగమంతులస్వామిని నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖామంత్రి మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి తదితరులు దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వేలాదిగా మొక్కులు చెల్లించుకోగా..



గంపలతో వెళ్తున్న భక్తులు

గుట్ట కింద నిర్మించిన కోనేటిలో వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించారు. చిన్న పిల్లలు కేరింతలు కొడుతూ ఈతలు కొట్టారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశారు. కోనేటి మధ్యలో శివుడి విగ్రహం ఆకర్షణీయంగా నిలిచింది. జాతరలో తప్పిపోయిన వారి కోసం సమాచార కేంద్రం పనిచేసింది. మర్రిచెట్టు కిందికి తరలించి మైక్‌లో ప్రకటించి వారి తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించారు. భక్తులు గంపలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతర సందర్భంగా బెట్టింగులు



జాతర సందర్భంగా పలువురు అక్రమ బెట్టింగులకు పాల్పడ్డారు. జాతర ఆవరణలో సుమారు 10 నుంచి 15చోట్ల అక్రమ బెట్టింగ్ క్రీడలు నిర్వహించారు. గుండు ఆట, లోనాబయట లాంటి ఆటలతో భక్తుల జేబులకు చిల్లు పడింది. పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.

తాగు నీటికి కటకట

జాతరకు వచ్చిన భక్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. భక్తులే కాక పోలీసు, ఇతర శాఖల నుంచి జాతర విధులు చేస్తున్న సిబ్బం ది సైతం తాగునీటి కోసం అల్లాడారు. వంటలు చేసుకునేందుకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సి వచ్చింది.

అందరినీ ఆదుకునే లింగమయ్య



కోరిన కోర్కెలు తీర్చే పెద్దగట్టు లింగమంతులస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. కుటుంబసభ్యులంతా గంపల ప్రదక్షిణ చేసి లింగమయ్య మొక్కు తీర్చుకుని బోనం నైవేద్యం సమర్పించి ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా భక్తులు స్వామిని దర్శించుకుని క్షేమంగా ఇంటికి చేరాలి. వచ్చిన భక్తులు పెద్దగట్టు పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

● కడారి సతీష్‌యాదవ్, పెద్దగట్టు మాజీ చైర్మన్

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

జాతర సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయి. హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద నుంచి ఖాశీంపేట క్రాస్‌రోడ్డు వరకు ఎడమ వైపున రోడ్డును బ్లాక్ చేశారు. కేవలం కుడి వైపున హైద్రాబాద్-విజయవాడకు రెండు వైపులా రాకపోకలు సాగే విధంగా చర్యలు చేపట్టారు. కొంత మంది వాహనదారులు వారి వాహనాలను రోడ్డు పక్కన నిలిపి దేవుని దర్శనానికి వెళ్లిపోయారు. ఆ వాహనాల వలన ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి. వాహనాల దారి మళ్లింపు చేపట్టినప్పటికీ ట్రాఫిక్ ఇబ్బంది కలిగింది. భక్తులు సోమవారం మధ్యాహ్నం తర్వాత వారి గ్రామాలకు తిరుగు ప్రయాణమైన సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయి. మధ్యాహ్న సమయంలో జాతరకు ఎటూ రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అసలే ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న భక్తులకు ట్రాఫిక్ జామ్ మరింత ఇబ్బందులు కలిగించింది. సూర్యాపేట డీఎస్పీ రవి వెంటనే తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



దురాజ్‌పల్లి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద ట్రాఫిక్

జాతరలో దొంగల చేతివాటం

సూర్యాపేటక్రైం: దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరలో రెండవ రోజు సోమవారం దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో పలువురు జేబు దొంగలు చైన్‌స్నాచర్స్ ఇతర దొంగతనాలకు పాల్పడే దొంగలు భక్తుల సెల్‌ఫోన్లు, పర్సులు, నగదు, కొందరి బంగారు ఆభరణాలు దొంగిలించారు. జాతరలో రద్దీగా ఉన్న ప్రాంతాలైన దేవాలయం, గర్భగుడి వద్ద, మర్రి చెట్టు సమీపంలో దొంగలు ఎక్కువగా చేతి వాటం చూపించారు. జాతరలో చోరీలు జరగకుండా ఉండేందుకు పోలీసులు మఫ్టీలో బందోబస్తు నిర్వహించినప్పటికీ దొంగతనాలు జరిగాయి. కొంత మంది మహిళలు వారి ఆభరణాలు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాతరకు విలువైన బంగారు ఆభరణాలు ధరించి రాకూడదని పోలీసులు సూచించినప్పటికీ భక్తులు మాత్రం ఆ సూచనలు పట్టించుకోలేదు. పోలీసులు కొందరు జేబుదొంగలను అదుపులోకి తీసుకున్నారు.



హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

● రూ. 50వేల జరిమానా ● హుజూర్‌నగర్ కోర్టు తీర్పు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన గుంజ చిన్నసైదులు అనే సుతారి మేస్త్రీ ఆగస్టు 8, 2017న తన పని నిమిత్తం హుజూర్‌నగర్‌కు వచ్చి మోటార్ సైకిల్‌పై తిరిగి వెళుతుండగా మార్గ మధ్యలో పట్టణంలోని లక్కవరం రోడ్డులో గల అంబేద్కర్‌కాలనీ వద్ద మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడి స్పృహ కోల్పోయి ఉండడాన్ని కొందరు గమనించి 108కు ఫోన్ చేశారు. దీంతో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సైదులు పరిస్థితిని గమనించిన వైద్యులు ఖమ్మం తీసుకెళ్లాని సూచించారు. సైదులును తండ్రి బుడ్డయ్య ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. మరుసటి రోజు బుడ్డయ్య హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి రోడ్డు ప్రమాద కేసుగా భావించి కేసు నమోదు చేశారు. గుంజ సైదులు ఆరోగ్యం కుదుట పడి అమరవరానికి రాగా అమరవరం గ్రామానికి చెందిన రాజుల వీరలింగం మరో వ్యక్తితో వచ్చి మోటార్‌సైకిల్‌ను అడ్డగించి కర్రతో దాడిచేసి కడుపులో బలంగా కొట్టాడని, తాను కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు రావడాన్ని గమనించి పారిపోయారని బాధితుడి ఫిర్యాదుతో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి 341, 307 కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం అమరవరం గ్రామానికి చెందిన వీరలింగం అనే వ్యక్తి తన సోదరితో గుంజ సైదులు వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడని కక్షతో అతన్ని ఎలాగైనా చంపాలని పథకం ప్రకారం 2017 ఆగస్టు 8న గుంజ సైదులు ఒంటరిగా వెళుతున్న సమయంలో తన బంధువైన అంబేద్కర్ కాలనీకి చెందిన మోదాల నవీన్ సహకారంతో లక్కవరం రోడ్డులో ఏకాంత ప్రదేశంలో సైదులును అడ్డుకుని హత్యాయత్నానికి పాల్పడినట్లుగా దర్యాప్తులో తేలడంతో అప్పటి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి నవీన్, వీరలింగంలను అరెస్టుచేసి కోర్టుకు రిమాండ్ చేశారు. దీంతో విచారణ అనంతరం న్యాయమూర్తి జిట్టా శ్యామ్‌కుమార్ 10 మంది సాక్షులను విచారించి నిందితులపై నేరం రుజువు కావడంతో హత్యాయత్నానికి పాల్పడిన వీరలింగం, నవీన్‌లకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆదేశించారు. అలాగే బాధితుడిని అక్రమంగా అడ్డుకున్నందుకు రూ.500ల జరిమానా, ఆ జరిమానా కూడా చెల్లించకపోతే ఒక్కొక్క వ్యక్తికి నెలరోజుల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. జరిమానా రూ.50 వేలను బాధితుడు గుంజ చిన్న సైదులుకు అప్పీలు సమయం పూర్తయిన తర్వాత అందించాలని, మిగిలి వెయ్యి రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపు అదనపు పీపీ వెంకటేశ్వర్లు వాదించగా, స్థానిక ఎస్‌ఐ ముత్తయ్య సూచనల మేరకు కోర్టు కానిస్టేబుల్ రాము ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

మహా కుంభాభిషేకానికి చకచకా ఏర్పాట్లు

● రేపటి నుంచి 23వ తేదీ వరకు స్వర్ణ గోపురోత్సవ పూజలు ● పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ● 23 నుంచి 28 వరకు మహాశివరాత్రోత్సవాలు ● 19న స్వాతి నక్షత్రం, గిరిప్రదక్షిణ



విద్యుత్ దీపాలంకరణతో యాదగిరిగుట్ట ప్రధానాలయం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో వరుస ఉత్సవాల నిర్వహణకు శుభ ఘడియలు దగ్గరపడుతున్నాయి. మహా కుంభాభిషేకానికి నలుదిక్కుల నుంచి భక్తులు తరలివస్తారనే అంచనాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం ఎ. రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్వర్ణ గోపుర ఆవిష్కరణోత్సవంలో ప్రత్యేకంగా ఎన్నికల కమిషన్ అనుమతితో పాల్గొననున్నారు.

రేపటి నుంచి మహాకుంభాభిషేకోత్సవాలు

ఈ నెల 19 నుంచి స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి స్వర్ణ తొడుగుల పనులు పూర్తయ్యాయి. బంగారు గోపురం ఆవిష్కరణకు మహా కుంభాభిషేకం రుత్వికులు, పారాయణీకులచే 22 వరకు వివిధ రకాల పూజలు నిర్వహించేందుకు ఆలయ ఉత్తర తిరువీధిలో ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేశారు. క్రతువులో 108మంది రుత్వికులు వేద పారాయణ మంత్ర పఠనాలు చేసి 23న స్వామివారి బంగారు తొడుగులు పూర్తైన దివ్య విమాన రాజగోపురానికి మహా కుంభాభిషేకం సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చేపట్టేందుకు నిర్ణయించారు. లక్ష మందికి ఉచిత ప్రసాదం, రోజుకు 2వేల మందికి అన్నప్రసాదం అందజేయాలని ఈవో ఏ. భాస్కర్‌రావు సంకల్పించారు. ప్రతి నెలా చేపట్టే గిరిప్రదక్షిణ మహోత్సవం స్వామివారి జన్మదినం స్వాతి నక్షత్రం రోజున నిర్వహించడం ఆచారం. గిరిప్రదక్షిణలో సుమారు 10 నుంచి 15 వేల మంది వరకు భక్తులు పాల్గొంటారని అంచనా.

23 నుంచి మహాశివరాత్రోత్సవాలు

శివకేశవుల క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన ఇక్కడి శివాలయంలో ఏటేటా జరిగే మహాశివరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 23న స్వస్తివాచనం, అంకురారోపణతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 24న(ఏకాదశి) ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీపూజ, అగ్నిప్రతిష్ఠ, 25న రుద్రహవనం, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి కల్యాణం, 26న అభిషేకాలు, శతరుద్రాభికాలు, 27న లక్ష బిల్వార్చన, రథోత్సవం, 28న పూర్ణాహుతి, త్రిశూల తీర్థ కార్యక్రమాలతో శివరాత్రోత్సవాలు పరిసమాప్తి అవుతాయి. సోమవారం గర్భాలయాన్ని శుద్ధిచేసి అలం కరించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3.30వరకు ఆలయం మూసేశారు.

శివకేశవులకు విశేష పూజలు

లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయం ముఖమండపంలోని స్ఫటిక మూర్తులను అర్చకులు పంచామృతాలతో అభిషేకించారు.

అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 19వ తేదీన చేపట్టనున్న మహాకుంభాభిషేక మహోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఎన్. శ్రీధర్ ఆదేశించారు. కలెక్టర్ ఎం. హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావులతో కలిసి యాదగిరికొండపై ప్రోటోకాల్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న స్వర్ణగోపురం ప్రారంభోత్సవానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి వస్తున్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులకు కేటాయించిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వేడుకలకు వీఐపీల రాక దృష్ట్యా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు పర్యవేక్షిస్తూ ప్రొటోకాల్ మేరకు పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న స్వర్ణ విమాన రాజగోపుర మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించినట్లు వివరించారు. సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, జడ్పీ సీఈవో శోభరాణి, బీసీ సంక్షేమ అధికారి పి. యాదయ్య, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రఘు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్

లెక్క పక్కాగా ఉండాలి

తెలంగాణలో భూముల లెక్కలు పక్కాగా తేల్చేందుకు, భూ వివాదాలు లేకుండా చూసేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దీని కోసం విస్తృత స్థాయిలో భూములు సర్వే చేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కేటాయించి ఆధునిక పరికరాలను కొనుగోలు చేసి సర్వే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై దేవరకొండ నియోజకవర్గంలోని రైతులు, రైతుసంఘాల నేతలు, ప్రజలు 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ)


ప్రభుత్వ నిర్ణయం రైతులకు మేలు చేకూరేలా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరికరాలతో బడ్జెట్‌లో నిధులు కేటాయించి పైలెట్ ప్రాజెక్టు ద్వారా భూములను పక్కాగా సర్వే నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయం మంచిదే. ఈ నిర్ణయం రైతులకు మేలు చేకూరుస్తుంది. భూముల లెక్కలు తేలక వివాదాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

దేప సుదర్శన్‌రెడ్డి, రైతుసంఘం నాయకుడు, దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామం.


భూముల లెక్కలు తేల్చాలి



రాష్ట్రంలో భూముల లెక్కలను ప్రభుత్వం మొదటగా తేల్చాలి. గత ప్రభుత్వం ధరణి ఏర్పాటు చేయడంతో ఒకరిపేరున ఉన్న భూమి మరొకరి పేరుకు మారడంతో ఎన్నో వివాదాలు, ఘర్షణలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలి. లెక్కలు పక్కాగా తేలితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

కంభాలపల్లి ఆనంద్, వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు, పీఏపల్లి మండలం.

భూ సమస్యలు పరిష్కరించాలి



పైలెట్ ప్రాజెక్టుకు నిధులు కెటాయించి సర్వే పూర్తిచేసి భూసమస్యలను పరిష్కరించాలి. సర్వే కోసం ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలి. గ్రామాల్లో భూముల లెక్కలు తేలక వివాదాలతో ఇబ్బందులు పడుతున్నారు. భూ సమస్యలు పరిష్కరించాలి.

నాగవరం ప్రభాకర్‌రావు, రైతు, తూర్పుపల్లి, దేవరకొండ మండలం

వివాదంలో ఉన్న భూముల సమస్యలు పరిష్కరించాలి



భూముల సర్వే నెంబర్లలో తప్పులు పడి ఒకరి భూమి ఒకరి పేరున ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని సరి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వం ఆధునిక పరికరాలతో భూముల లెక్కలు తేల్చేందుకు సర్వే చేపట్టడం మంచి పరిణామం. వెంటనే చేపట్టి తప్పు ఒప్పులను సరిచేసి భూముల లెక్కలు పక్కాగా తేల్చాలి.

● బిజిలి లింగయ్య, దేవరకొండ

భరోసా పైకం గందరగోళం

● కటాఫ్‌లోనూ పూర్తిగా జమకాని డబ్బులు ● ఆందోళన చెందుతున్న రైతులు ● కొందరు రైతులకు తక్కువ జమ అవుతున్న డబ్బులు ● సమాధానం చెప్పలేక అధికారులు సతమతం

మోత్కూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం గందరగోళంగా మారింది. సాగు యోగ్యం కాని భూములను తొలగించి, సాగు యోగ్యమైన భూమి మొత్తానికి ఎకరాకు పంటకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సాగు యోగ్యం కాని భూమి సర్వే చేసి తొలగించి గత నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల అనంతరం గత నెల 26న మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ప్రారంభంతో పాటు ఆ గ్రామంలోని రైతులందరికీ సాగు యోగ్యమైన భూమికి రైతు భరోసా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అందులో భాగంగా మోత్కూరు మండలంలో పాటిమట్ల గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంలో ఉన్న 553మంది రైతులకు రూ.97,72,843 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇలానే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంలోని రైతులందరికి రైతు భరోసా డబ్బులు జమ చేశారు.




విడతల వారీగా ఒక్కో ఎకరం చొప్పున

మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి రైతు భరోసా ఇవ్వడంతో మిగతా గ్రామాల రైతుల్లో అసంతృప్తి నెలకొనడంతో ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే అనుసరిస్తూ ఒక్కో ఎకరం కటాఫ్‌గా పెడుతూ విడతల వారీగా ఇప్పటి వరకు మూడు ఎకరాల వరకు రైతు భరోస నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో వేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నెల 5న ఒక ఎకరం వరకు రాష్ట్రంలో 17.03లక్షల మంది రైతులకు రూ.1,126.54 కోట్లు, ఈ నెల 10న రాష్ట్రంలో రెండెకరాల వరకు 34.69లక్షల మంది రైతులకు రూ.2,218.49 కోట్లు, ఈ నెల 12న మూడెకరాల వరకు 9.56లక్షల మంది రైతులకు 1,230.98కోట్లు రైతు భరోసా కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

కటాఫ్‌లోనూ అరకొరగా నిధుల జమ

ప్రభుత్వం ప్రకటించి మూడు ఎకరాల వరకు సాగు యోగ్యమైన భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా నిధులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదని రైతులు చెబుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పనక బండ గ్రామంలో బత్తిని మురళి అనే రైతుకు 2ఎకరాల 15 గుంట భూమి ఉండగా అతనికి కేవలం రూ.450(మూడు గుంటల డబ్బులు) మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. బుజిలాపురం గ్రామానికి చెందిన మడూరు సుధాకర్‌రెడ్డికి ఎకరం 29 గుంటల భూమి ఉండగా అతనికి రూ10,350 జమ కావాల్సి ఉండగా రూ.8100 (54గుంటలకు) వచ్చాయి. ధర్మాపురం గ్రామానికి చెందిన పాకపాటి రాధికకు ఎకరం 08 గుంటల భూమి ఉండగా కేవలం ఏడు గుంటలకు మాత్రమే వచ్చాయ న్నారు. పనకబండలో బత్తిని రాములమ్మకు 15గుంటలు, మోత్కూరులో సామ వెంకట్‌రెడ్డికి పది గుంటలు, ధర్మాపురంలో నాయిని గోపాల్‌రెడ్డికి ఎకరం 30గుంటలు, మోత్కూరులో ఊట్కూరు నరేందర్‌రెడ్డికి ఒక ఎకరం 14గుంటలు భూమి ఉండగా వారికి రైతు భరోసా డబ్బులు రాలేదని చెప్పా రు. రైతు భరోసా అందని రైతులంతా ఏఈవోల చుట్టు తిరుగుతు న్నారు. వారు ఏం సమాధానం చెప్పలేక పోతున్నారు. తక్కువ వచ్చిన వారికి ఎందుకు తక్కువ వచ్చాయో. తక్కువ విస్తీర్ణం ఉన్నా రాని వారికి ఎందుకు రాలేదో చెప్పలేక పోతున్నారు. దీంతో తమకు రైతు భరోసా అందుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.



2.15 గుంటల భూమికి రూ.450 జమ అయినట్టు చూపుతున్న స్టేట్‌మెంట్

2.15గుంటలకు రైతు భరోసా రూ.450 వచ్చాయి



నాకు పనకబండ గ్రామంలో రెండు ఎకరాల 15 గుంటల భూమి ఉంది. ఏటా ఆ భూమిని సాగు చేస్తాను. ఎకరాకు రూ.6 వేల చొప్పున 2 ఎకరాల 15 గుంటలకు రూ.14,250లు రావాలి. బ్యాంకు ఖాతాలో కేవలం రూ.450 (మూడు గుంటల డబ్బులు) జమ అయ్యాయి. ఆ డబ్బులు తీసుకోకుండా ఏవో కీర్తి వద్దకు వెళ్లి అడగ్గా ఆమె ఆన్‌లైన్‌లో చూసి అలా ఎందుకు వచ్చాయో తెలియదని చెప్పారు. తర్వాత వస్తుండవచ్చన్నారు. ఇప్పుడు తక్కువ ఎందుకు వచ్చాయని అడిగితే సరైన సమాధానం చెప్పలేకపోయారు. ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానం లేకుండా పని చేస్తున్నది. అధికారులు కూడా సరైన సమాధానం చెప్పడం లేదు.

● బత్తిని మురళి, రైతు, యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం, పనకబండ గ్రామం.

రూ.10,350 రావాల్సి ఉండగా రూ.8100 జమ అయ్యాయి



నాకు బుజిలాపురం గ్రామంలో ఒక ఎకరం 29 గుంటటు ఉంది. ఎకరాకు రూ.6 వేల చెప్పున 69 గుంటలకు రూ.10,350 రైతు భరోస రావాలి. రూ.8,100(54 గుంటల డబ్బులు) నా ఖాతాలో జమ అయ్యాయి. వ్యవసాయ అధికారులను అడిగితే తక్కువ ఎందుకు జమ అయ్యాయో తెలియదన్నారు.

● మడూరు సుధాకర్‌రెడ్డి, రైతు, యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామం.

వ్యవసాయ శాఖ కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లాం

ఎకరాల వారీగా ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. ఎకరం, రెండెకరాల లోపు కూడా కొందరికి రాలేదని, మరి కొందరు తక్కువ వచ్చాయని ఫోన్లు చేస్తున్నారు. ఈ సమస్యను వ్యవసాయ శాఖ కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లాం. ఒకట్రెండు రోజుల్లో క్లారిటీ వస్తుంది. ప్రభుత్వం అందరికీ సాగు యోగ్యమైన భూమికి రైతు భరోసా అందిస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు.

● గోపాల్ డీఏవో, యాదాద్రి భువనగిరి జిల్లా.

సరైన పత్రాలు లేని పురుగుమందుల సీజ్

రూ.30 లక్షల విలువైనవిగా గుర్తింపు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొరియర్ సెంటర్‌లో సరైన పత్రాలు లేని 30లక్షలు విలువ చేసేపురుగుమందులను సీజ్ చేశామని, మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని డెలివరీ కొరియర్ సర్వీస్‌కు హర్యానా నుంచి ఆన్‌లైన్ కొరియర్ సర్వీస్ ద్వారా హుజూర్‌నగర్‌కు చెందిన లక్ష్మీసీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ అండ్రస్ పేరుతో 300 కేజీల ఫంగిసైడ్స్ మందులు వచ్చాయని సమాచారంతో విజిలెన్స్ సీఐ గౌస్‌తో కలిసి కొరియర్ సెంటర్‌పై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సరైన పత్రాల లేని 30లక్షలు విలువైన 300 కేజీల మందులను సీజ్ చేశామని, లక్ష్మీ సీడ్స్ ఫెర్టిలైజర్ యజమాని వెంకటరెడ్డిని ప్రాథమికంగా విచారించగా తనకు ఆర్డర్‌తో ఎటువంటి సంబంధం లేదని తెలిపాడని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని మందులను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నామని విజిలెన్స్ అధికారి గౌస్ తెలిపారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి పద్మ, ఏఈవో సతీష్ పాల్గొన్నారు.

అసమ్మతికి అధిష్ఠానం బ్రేక్

(5వ పేజీ తరువాయి): కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ అసమ్మతివర్గ నాయకుల అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. వర్షిత్‌రెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలివ్వడానికి దారి తీసిన సమీకరణాలను వారికి వివరించారు. త్వరలో పార్టీ రాష్ట్ర కమిటీకి కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుందని, ఆ తర్వాత ఈ అంశాన్ని చర్చిద్దామని నచ్చజెప్పారు. అంతేగాక పార్టీ కార్యకలాపాల్లో ఏకపక్ష నిర్ణయాలతో వెళ్లకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను, నిర్ణయాలను కొనసాగించేందుకు ఏకపక్షంగా కాకుండా సమష్టిగా ఉండేందుకు అవసరమైన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏ నిర్ణయమైనా ఉమ్మడిగా ఉండేలా ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. రానున్న మున్సిపల్, గ్రామపంచాయతీ, పరిషత్‌ల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను సమన్వయ కమిటీ ద్వారానే చేపడతామనే హామీ అసమ్మతివర్గ నాయకులకు దక్కింది. పార్టీ కీలక బాధ్యతల్లో ఉన్న నేతలే స్వయంగా రంగంలోకి వచ్చి, అసమ్మతివర్గ నాయకులతో మాట్లాడడంతో పాటు, తగిన పరిష్కారానికి ఏర్పాటు చేస్తామనే హామీ ఇవ్వడంతో పార్టీ అధ్యక్ష పదవిపై బహిరంగ నిరసనలు, ఆందోళనలు చేయవద్దని నిర్ణయించుకున్నట్లు నాయకులు పేర్కొన్నారు. అధిష్ఠాన ముఖ్యులు ఇచ్చిన హామీ మేరకు ఇకపై ఆందోళనలు చేసేది లేదని, పార్టీ ముఖ్యనేతలు సూచించినట్టు అధ్యక్షుడు ఇకపై అందరినీ కలుపుకుపోతారని ఆశిస్తున్నామని, సమష్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి శ్రీకారం చుడతారని భావిస్తున్నామని అసమ్మతి నాయకులు తెలిపారు.

బావను మోసం చేసిన బావమరిది

● రెండు ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం

ఆత్మకూరు (ఎం) ఫిబ్రవరి 17: (ఆంధ్రజ్యోతి): బావ అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అతని పేర ఉన్న రెండు ఎకరాల భూమిని కాజేశాడు బామ్మర్ది. ఈ విషయం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు , అతని బంధువులు సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం రాయిపల్లి గ్రామానికి చెందిన జెట్ట కొమురయ్య (61) అనే వృద్ధుడు (అతనికి మతిస్థిమితం) సరిగా లేదు. కొమురయ్యకు తండ్రి నుంచి రెండు ఎకరాల భూమి సంక్రమించింది. కాగ 2024 నవంబరు నెల 17 తేదిన కొమురయ్య భార్య సావిత్రి, నవంబరు 30 వ తేదిన కొడుకు నరేష్ లు ఒకే మాసంలో 15 రోజుల తేడాతో అనారోగ్యంతో భార్య, కొడుకు ఇద్దరు చనిపోయారు. కొమురయ్య అత్తగారు మూటకొండూరు. అక్క అల్లుడు చనిపోయారు బావను నిద్రచేయించాలని బావమరిది భూమండ్ల మల్లేష్ 2024 డిసెంబర్ 12 న కొమురయ్యను మోటకొండూరుకు తీసుకెళ్లాడని తెలిపారు. కొమురయ్య వారం రోజులు అత్తగారింట్లో ఉన్నాడు. బావ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకున్న బావమరిది మాయమాటలు చెప్పి ఎవరికీ అనుమానం రాకుండా డిసెంబరు 19 న ఆత్మకూరు (ఎం) తహసీల్దార్ కార్యాలయానికి నేరుగా తీసుకొచ్చి కొమురయ్య పేరుమీద ఉన్న రెండు ఎకరాల భూమిని బావమరిది భూమండ్ల మల్లేష్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వెంటనే బావను తీసుకుని మళ్లీ మూటకొండూరుకు వెళ్ళాడు. కొమురయ్య మూటకొండూరులోనే ఉన్నాడు అనుకుంటున్నారు బంధువులు. కొమురయ్య తల్లి జెట్ట మల్లమ్మ ఈనెల 9 తేదీన మృతిచెందిందనే విషయం తెలియగానే కొమురయ్య రాయిపల్లికి వచ్చి తల్లికి దహన సంస్కారాలు నిర్వహించాడు. ఈ సందర్భంగా తన బావమరిది మల్లేష్ తనను మోసం చేసి దొంగతనంగా తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని బంధువులకు తెలిపాడు. కొమురయ్య తమ్ముడి పిల్లలకు ఆస్తి (భూమి) చెందుతుందని అక్కసుతో మల్లేష్ బావను మోసం చేసి భూమిని కాజేశాడని అతని బంధువులు ఆరోపించారు. ఏదో కాగితంపై సంతకం పెట్టాలని తీసుకువెళ్లి, దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న తన భూమిని తనకు ఇప్పించాలని కొమురయ్య అధికారులను కోరాడు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత


పట్టుబడ్డ గోవులు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న మినీ డీసీఎంను పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ హనుమాన్ జంక్షన్ నుంచి మినీ డీసీఎంలో తొమ్మిది ఆవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద సోమవారం పట్టుకున్నారు. డ్రైవర్ వెంకటయ్యను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా?


అనంతారంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం

తుంగతుర్తి నియోజకవర్గంలో పేదల సొంతింటి కల కలగానే మిగిలింది. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో తప్ప ఎక్కడా కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంచలేదు.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

▸▸ 11 ఏళ్లుగా దరఖాస్తుదారుల ఎదురుచూపు ▸▸

తుంగతుర్తి నియోజకవర్గంలోని 9 మండలాల్లో ఆయా మండలాలకు మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రెండు, మూడు మండలాల్లో నిర్మాణం పూర్తికాగా, మిగతా మండలాల్లో బేస్‌మెంట్, స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయాయి. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో ప్రభుత్వ స్థలాలు లేవన్న సాకు తో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల వుతున్నా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే అప్పుడూ ఎన్నికల కోడే ఉంటుందని, ఇక తమకు ఇళ్లు మంజూరయ్యేది ఎప్పుడో అని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

పేరు మారుతున్న ఫలితం శూన్యం

ఇళ్లులేని పేదలు ప్రభుత్వం ఇచ్చే ఇంటి కోసం, ఇంటి నిర్మాణానికి అందించే సాయం పదకొండేళ్లుగా దరఖాస్తుదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇళ్ల పథకం పేరు మారుతున్నదే తప్ప ప్రజలకు ప్రయోజనం మాత్రం అందడం లేదు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకానికి శ్రీకారం చు ట్టారు. మొదటి విడత 2014-2018నియోజకవర్గంలో చేపట్టిన 563 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కొన్నింటి నిర్మాణమే పూర్తయ్యింది. మరికొన్ని బేస్‌మెంటు, స్లాబ్ లెవల్‌లో ఆగిపోగా ఇంకా కొన్నింటి నిర్మాణం ప్రారంభించనే లేదు. 2018 ఎన్నికల్లో గెలిచి రెండోసారి అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పథకం విఫలం కావడంతో గృహలక్ష్మి పథకా న్ని తెరమీదకు తెచ్చింది. ఈ పథకంలో ఇళ్లు నిర్మిం చుకునే వారికి రూ.5లక్షలు సాయం అందిస్తామని ప్రకటించింది. కాలయాపన చేసి, చేసి చివరకు 2023 ఆగస్టులో నియోజకవర్గంలో 3 వేలు ఇళ్లు మంజూరు చేసింది. పలువురు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో 2023 డిసెంబరులో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో లబ్ధిదారులు తాము ఇళ్లు నిర్మించుకుంటే డబ్బుల వస్తాయో రావోనని గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు చేపట్టలేదు.

కొత్త లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడో

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గృహలక్ష్మి పథకానికి మంగళం పాడి ఇందిరమ్మ ఇళ్ల పథకం తెచ్చింది. ఈ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించింది. 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలన పేరిట గ్రామాల్లో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. అందులో సొంత ఇల్లు ఉందా లేదా అన్న ఆప్షన్ కూడా ఉంది. గత జనవరి 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, రేషన్ కార్డులు తదితర వాటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల జాబితాలు కూడా చదివి వినిపించారు. అందులో పేర్లు లేనివారి నుం చి గ్రామ సభల్లోనే మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని గ్రామ సభల్లో చెప్పారు. మంజూరైన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక మాత్రం పూర్తి కాలేదు.

పూర్తయినవి పంచరా?

అర్వపల్లి మండలంలో పూర్తయిన 25 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి పంపి ణీ చేశారు. నూతనకల్ మండలం చిల్పకుంట్ల, మద్దిరాల, నాగారం మండలం వర్ధమానుకోట, డి.కొత్తపల్లి, తుంగతుర్తి, శాలిగౌరారం మం డలం తక్కళ్లపాడు, బైరవునిబండ గ్రామాల్లో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులను ఎం పిక చేసి పంచలేదు. వర్ధమానుకోట, డి.కొత్తపల్లి గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఇళ్లు లేని వారు నివసిస్తుండగా మిగతా గ్రామాల్లో నిర్మాణం పూర్తయినా పంపిణీ జరగక నిరుపయోగంగా ఉం టున్నాయి. వాడకం లేకపోవడంతో తలుపులు, కిటికీలు విరిగిపోతున్నాయి. కాలనీల్లో కంప చెట్లు మొలిచాయి. భవనాలు శిథిలమవుతున్నాయి.

మండలం	గ్రామం	మంజూరైన ఇళ్లు	నిర్మాణం పూర్తయినవి	వివిధ స్థాయిల్లో నిలిచినవి	నిర్మాణం ప్రారంభం కానివి
తుంగతుర్తి	తుంగతుర్తి	18	18	--	--
నాగారం	వర్ధమానుకోట	50	50	--	--
	డి.కొత్తపల్లి	75	75	--	--
తిరుమలగిరి	అనంతారం	65	---	60	05
మద్దిరాల	మద్దిరాల	75	75	--	--
	గోరంట్ల	30	---	30 (బీఎల్)	--
	పోలుమల్ల	50	---	30 (బీఎల్)	20
నూతనకల్	చిల్పకుంట్ల	35	35	--	--
	పెద్దనెమిల	30	---	30 (బీఎల్)	--
శాలిగౌరారం	తక్కళ్లపాడు	25	25	--	--
	బైరవునిబండ	25	25	--	--
	అడ్లూరు	30	---	--	30
	ఆకారం	30	---	--	30
అర్వపల్లి	అడివెంల	25	25	--	--
మొత్తం		563	328	150	85

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పంచాలి



గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కొన్ని పూర్తి కాగా మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలోనూ మౌలిక వసతులు కల్పించక పంపిణీ చేయకుండా వదిలేశారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా ఉండి, శిథిలమవుతున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పంచాలి.

-కడెం లింగయ్య గౌరెలు, మేకల పెం పకందారుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

నిర్మాణాలు పూర్తికాక మాకు అప్పగించలేదు

తిరుమలగిరి మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనంతారంలో 65 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నిర్మాణాన్ని ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షించింది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో మాకు అప్పగించ లేదు. ఇళ్లు మా శాఖకు అప్పగించనందున లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా చేపట్టలేదు. నిర్మాణం పూర్తయ్యే వరకు అవి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోనే ఉంటాయి. ఇళ్లను మాకు అప్పగించాకే లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది.

- (బి.హరిప్రసాద్, తహసీల్దార్, తిరుమలగిరి)

ప్రతీనెలా 18 వరకు రేషన్ పంపిణీ చేయాలి

మర్రిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ప్రతీనెలా నెల 18వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మర్రిగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపంపిణీలో భాగంగా కొత మంది లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకోలేకపోతున్నారని అన్నారు. రేషన్‌బియ్యం నిల్వలు ఉంటున్నందున్న ప్రతీనెలా 18 వ తేదీ వరకు రేషన్ డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు.

లచ్చిరాంకు గౌరవ డాక్టరేట్

రామగిరి, ఫిబ్రవరి 17 : మర్రిగూడ మండలం దామర భీమనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాంకు అరుదైన డాక్టరేట్ గౌరవం దక్కింది. దశాబ్దకాలం పాటు ఉపాధ్యాయ వృత్తిలోనూ మరియు వివిధ సామాజిక అంశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం వంటి సేవలను గుర్తించిన ఢిల్లీ ఏసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసర్చ్ యూనివర్సిటీ వారు అయనకు గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేశారు.

ముగిసిన గోపలాయపల్లి బ్రహ్మోత్సవాలు

● శతకలశాభిషేకం, ధ్వజపట, దేవతా ఉద్వాసన



శతకలశాభిషేక పూజలు నిర్వహిస్తున్న యాజ్ఞీకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లిలో వారిజాల గుట్టపై హరిహర క్షేత్రంగా బాసిల్లుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి మండప ప్రాకారంలో శతకలశాభిషేక పూజ నిర్వహించారు. సాయంత్రం ధ్వజపట, దేవతా ఉద్వాసన, శ్రీపుష్పయాగం, ఏకాంత సేవలు, పవలింపు సేవతో ఉత్సవాలు పరిసమాప్తి అయ్యాయి. ఆదివారం రాత్రి స్వామివారికి దోపోత్సవాన్ని ఆద్యంతం ఆకట్టుకునేలా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాపురం మత్స్యగిరి, కారంపూడి వెంకటాచార్యులు, దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అందెబండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

నాంపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెళ్లవాయి గ్రామంలో గుట్ట మీద వెలసిన అందెబండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రథోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వామివారి రథాన్ని లాగడానికి యువకులు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండెబోయిన మైసమ్మ, గట్ల రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, భాస్కర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

కట్టంగూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఎంటనే అమలు చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని ఈదులూరులో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెటీలను, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మిర్చి పంటలకు క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న భర్తీ చేయాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బూరుగు సత్తయ్య, నాయకులు గజ్జి రవి, కోనేటి మల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయాలి

చిట్యాల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం జరిగిన రైతు సంఘం మండల మహసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వానాకాలం, యాసంగి రెండు పంటలకు రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌కు కొమ్ముకాసే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, లడే రాములు, ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బండి రామలింగేశ్వరస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

కనగల్, ఫిబ్రవరి 17 ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామంలోని శ్రీబండి రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల (జాతర) పోస్టర్‌ను సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు ఐదురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.శంకర్‌శర్మ, గిరిప్రసాద్‌శర్మ తెలిపారు.

ఆపదమిత్ర వలంటీర్ల క్షేత్ర పరిశీలన

మునుగోడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మేజర్ గ్రామపంచాయతీలో ఆపదమిత్ర వలంటీర్లు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో భారీగా జరిగే ఆస్తి, ప్రాణనష్టం వంటి విపత్తులను ఎదుర్కోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆపదమిత్ర వలంటీర్లను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఎంపికైన వలంటీర్లు శిక్షణలో భాగంగా జిల్లా కేంద్రం నుంచి 50 మంది క్షేత్ర స్థాయిలో మునుగోడులో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివిధ రకాల ప్రమాదాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వలంటీర్ల పర్యవేక్షణలో క్లస్టర్ ఏపీడీ నర్సింహారావు, మధు, రామ్మూర్తి, రమణ తదితరులు ఉన్నారు.

మైసమ్మ గుడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కట్టంగూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న మైసమ్మ గుడి నిర్మాణానికి ఆ కాలనీ ప్రజలు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం కార్యక్రమంలో గుడి నిర్మాణ దాతలు బుడిగ సైదులుఅనూష దంపతులతో పాటు అంబేడ్కర్ నగర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు యాదవ్ గుడి నిర్మాణానికి విరాళంగా రూ.30వేలను ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, పోగుల నర్సింహ, బుచ్చాల వెంకన్న, మేడి ఈదయ్య, వంగూరి లక్ష్మయ్య, మేకల రమేష్, మేడి రాములు, ఉట్కూరి సైదులు, మేడి వెంకన్న, పూజారి శ్రీరామడుగు శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞంలో కూర్చున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన మూసీ

● జాతర భక్తుల సందడి

కేతేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండల పరిధిలోని మూసీ నది ఒడ్డు సోమవారం లింగమంతుల స్వామి భక్తులతో కిటకిటలాడింది. సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లిలో జరిగే లింగమంతుల స్వామి జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో మండల పరిధిలోని ఉప్పలపహాడ్ గ్రామ సమీపంలోని మూసీ నదిలో గల రామాలయం, గంగదేవమ్మ గుడివద్ద మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. గతంలో ఎడ్లబండ్లతో గంపలు కట్టి జాతరకు వెళ్లే భక్తులు జాతర వద్ద ఒకరోజు గడిపి మరుసటి రోజు ఉప్పలపహాడ్ సమీపంలోని మూసీ నదికి చేరుకునే వారు. మారిన కాలమాన పరిస్థితుల నేపథ్యంలో ఆటోలు, డీసీఎంలు, లారీల్లో జాతరకు వెళ్లిన భక్తులు సోమవారం లింగమంతుల స్వామికి మొక్కులు తీర్చి, దర్శనం చేసుకుని భోజనాలు చేసిన వెంటనే తిరుగు పయనమయ్యారు. సోమవారం సాయంత్రానికే మూసీ నది ఒడ్డున గల గంగదేవమ్మ గుడికి చేరుకున్నారు. దురాజ్‌పల్లి వద్ద జనసంద్రంలో వంటావార్పుకు స్థలం దొరకనివారు గంగదేవమ్మ ఆలయ సమీపంలోని ఉప్పలపహాడ్ స్టేజీ వద్ద, 65మూసీ నదిమీదుగా గల రోడ్డు వంతెనల కింద, మూసీ నదిలో టెంట్లు వేసుకుని వంటావార్పు చేపట్టారు. పలువురు భక్తులు మూసీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తిశ్రద్ధలతో గంగదేవమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి తగినట్లుగా ఉప్పలపహాడ్ స్టేజీ వద్ద కొబ్బరికాయలు, బోనం కుండలు, తినుబండారాలు, పిల్లల ఆట వస్తువులు విక్రయించే దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి. దీంతో ఇక్కడ వాతావరణం మరో దురాజ్‌పల్లి జాతరను తలపించింది.

దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరకు మండలంలోని మండలంలోని భీమారం, తుంగతుర్తి, ఉప్పలపహాడ్, కేతేపల్లి, కొత్తపేట, కొర్లపహాడ్ గ్రామాలలో యాదవులు అధిక సంఖ్యలో ఉన్నారు. ట్రాక్టర్లు, ఆటోలలో మందగంప కట్టుకున్న భక్తులు ఓ లింగా.... ఓ.. లింగా అంటూ కేరింతలు కొడుతూ, భక్తిగీతాలు పాడుకుంటూ ఆదివారం అర్ధరాత్రి వేళ జాతరకు వెళ్లారు.



మూసీలో స్నానాలు చేస్తున్న భక్తులు

కన్నుల పండువగా నేరడ పెద్దగట్టు జాతర



నేరడ పెద్దగట్టు జాతరలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న యాదవులు, మహిళలు

చిట్యాలరూరల్: చిట్యాల మండలం నేరడలోని పెద్దగట్టు జాతరకు యాదవుల కుటుంబాలతో పాటుగా ఇతర భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. జాతరలో భాగంగా శ్రీలింగమంతుల స్వామివార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, భక్తుల భక్తిశ్రద్ధల నడుమ స్వామివార్ల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణానంతరం స్వామివార్లకు ఒడిబియ్యాన్ని భక్తులు సమర్పించుకున్నారు. ఆలయంలో మాణిక్యమ్మ, ఆకుమంచమ్మ, లింగమంతుల స్వామి, ఎలమంచమ్మ, చౌడమ్మతల్లి, గంగమ్మతల్లి, రేణుక ఎల్లమ్మతల్లి దేవతలను, కల్యాణమంటపంలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాదవులు డప్పు వాయిద్యాలతో బోనాల ఊరేగింపులో యువకులు పెద్దఎత్తున నృత్యాలు చేసి సందడి చేశారు. కార్యక్రమంలో చిరగోని సత్తయ్య, ఆవుల నర్సింహ, చిరగోని శ్రీశైలం, చిరగోని లింగస్వామి, దుబ్బాక అమరేందర్‌రెడ్డి, దుబ్బాక రజనీకాంత్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్, కడారి శంకర్, చిరగోని విజయ్‌కుమార్, కడారి శ్రీను, వల్లపు ముత్తయ్య, సాగర్ల వేణు, వల్లపు రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కేక్ కట్ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఆనందోత్సవాల నడుమ బాణసంచా కల్చి సంబరాలు జరిపారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు బ్రెడ్, పండ్లను అందజేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. నార్కట్‌పల్లిలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ కార్యకర్తల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు వర్థిల్లాలని ఆకాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కేక్‌కట్ చేసి అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ మెయిన్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించి నకిరేకల్ మండలం తాటికల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ మాజీ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మాద ధనలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం కేసీఆర్‌కు గంగాజలాన్ని నీటిని అందిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి



నకిరేకల్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



పూజలు నిర్వహిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి దంపతులు

కుంభమేళాలో బీఆర్ఎస్ నేతల పూజలు

నల్లగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కుంభమేళాలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి శోభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లాకు చెందిన 15మందితో పాటు ప్రయాగ కుంభమేళాలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని, బీఆర్ఎస్‌కు పూర్వవైభవం వచ్చి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

వైభవంగా పంచమ మండల మహాపడి పూజ

శాలిగౌరారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని శ్రీ పార్వతీ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ మాలధారుల పంచమ మండల మహాపడి పూజ కన్నుల పండుగగా భక్తజన సమూహం మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పడి పూజ, మహా శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు, బిల్వ పుష్పాత్తర సహస్ర నామార్చన కార్యక్రమాలు గురుస్వామి కట్టగూరి వెంకన్న గౌడ్, ఆలయ ధర్మకర్త దాచవరం రాంబాబు శర్మ, గ్రామ పురోహితులు రామడుగు వెంకట్రామ శర్మల చేత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివమాల గురుస్వాములు అనుముల గోవర్ధన్, బండారు రాములు, అనుముల సతీష్, నిమ్మల సాయి బాబా, కంది పెద్ద సైదులు, కంది శంకరయ్య, దేవరకొండ సుధాకర్, బొడ్డు నగేష్ తదితరులు మాలధరులు, వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మహాపడి పూజలో పాల్గొన్న శివ మాలధారులు

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ బాలుర ఎంపిక

కట్టంగూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి గద్దపాటి హర్ష, 8వ తరగతి చదువుతున్న అంబారిపేట రిషి జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం కందాల రమ, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతమల్ల పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 20వ తేదీవరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే రెండో జాతీయస్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో జరిగింది. చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటలోని శాంతినగర్‌కు చెందిన ధరావత్ సాయిప్రసాద్(20) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులుండగా దాంతో సతమతమవుతున్నాడు. ఆరేళ్ల క్రితం సాయిప్రసాద్ తండ్రి చందాకు రోడ్డు ప్రమాదం జరగగా కాలికి గాయంతో ఇన్‌ఫెక్షన్ అయ్యింది. వైద్యులు తండ్రి పరిస్థితి గురించి చెప్పడం, కుటుంబ పరిస్థితులతో ఆందోళన చెందుతూ తండ్రికి మెరుగైన వైద్యం చేయించడం గురించి కుటంబ ఆర్థిక పరిస్థితుల గురించి ఆలోచనలో ఉన్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి నాలురోజుల క్రితం హైదరాబాద్‌కు ఉద్యోగానికి వెళ్లాడు. ఈనెల 16వ తేదీన సాయిప్రసాద్ హైదరాబాద్ నుండి బయలుదేరి మండలంలోని పెద్దకాపర్తి శివారులోని గాంధిగుడి సమీపంలోకి వచ్చాడు. కుటుంబ పరిస్థితులు తలచుకుని మదనపడుతూ పురుగుల మందు తాగి తన స్నేహితుకి తాను పురుగుల మందును తాగానని ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. అతని స్నేహితుడు 108 అంబులెన్స్‌కు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి 108 వాహనం చేరుకుని చికిత్స కోసం నల్లగొండలోని ప్రభుత్వాసుత్రికి తరలించారు. సాయిప్రసాద్ గురించి స్నేహితుడు కుటుంబ సభ్యులకు సమాచారమందజేశాడు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ ఆసుపత్రి నుండి సాయిప్రసాద్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికత్సనందిస్తుండగా ఈనెల 17వ తేదీన చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంసీహెచ్‌లో బాలింత మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్షంతోనే బాలింత మృతి చెందిందని ఆరోపిస్తూ జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ ఎదుట మృతురాలి బంధువులు సోమవారం ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏపల్లి మండలం పొగాకువారిగూడెం గ్రామానికి చెందిన మద్దిమడుగు వెన్నెల(28)కు నిండు నెలలు కావడంతో ఆమెను ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌కు బంధువులు తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి ఆమె పాపకు జన్మనిచ్చింది. ప్రసవం అయ్యాక చికిత్స పొందుతూ వెన్నెల సోమవారం తెల్లవారు జామున మృతిచెందింది. వైద్యులు వెన్నెలకు సరైన వైద్యం అందించకపోవడంతోనే మృతి చెందినట్లు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. తమ కుటుంబానికి జరిగిన అన్యాయం ఎవరికీ జరగవద్దని ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టడంతో స్థానిక టూటౌన్ ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో ఎంసీహెచ్‌కు వచ్చి బాధిత కుటుంబ సభ్యులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. వెన్నెల మృతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్ మాట్లాడుతూ ఆమెకి ప్రసవానికి ముందే ఎక్కువ బీపీ ఉండడంతో వారి కుటుంబ సభ్యులకు వివరించామని తెలిపారు. హైదరాబాద్‌కు రిఫర్ చేశామన్నారు. అయినా వారు వెళ్లకపోవడంతో వెన్నెలకు ఫిట్స్ రావడంతో మృతి చెందిందిందని, ఆమెను కాపాడడానికి ఎంతో ప్రయత్నించామన్నారు. డాక్టర్లు ప్రాణాలు కాపాడేందుకే చూస్తామని వివరణ ఇచ్చారు.



ఎంసీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న ఎస్ఐ నాగరాజు

స్త్రీనిధి నిధులు రూ.11లక్షలు స్వాహా

● గ్రామ వీబీకే నిర్వాకం

● 3 గంటల పాటు ఐకేపీ అధికారుల నిర్బంధం



గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మునుగోడురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాల సభ్యుల నుంచి స్త్రీనిధి డబ్బులు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయకుండా సుమారు రూ.11లక్షల రూపాయలు సొంతానికి వాడుకుంది. ఈ విషయం సంబంధిత అధికారుల విచారణలో తేలడంతో గ్రామ మహిళల సంఘాల సభ్యులు అధికారులతో పాటు, గ్రామ వీబీకేను గ్రామ పంచాయతీ కార్యాలయంలో 3 గంటల పాటు తాళం వేసి నిర్బంధించారు. ఈ సంఘటన మునుగోడు మండలంలోని కచిలాపురం గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత సంఘాల సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అదే గ్రామానికి చెందిన పెద్దమామిడి సుఖేందర్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా గ్రామ వీబీకేతో పాటు గ్రామంలో మినీ బ్యాంకును నిర్వహిస్తున్నారు. గ్రామంలో మినీ బ్యాంకు ఉన్నందున మండల కేంద్రంలోని మెయిన్ బ్యాంకుకు వచ్చే మహిళ సంఘాల సభ్యులు కూడా మినీ బ్యాంకుల్లో చెల్లించాలని అధికారులు సూచించారు. ఇదే ఆసరాగా చేసుకొని మినీ బ్యాంకు నిర్వాహకుడు నిధులు స్వాహా చేశాడు. మినీబ్యాంకు నిర్వాహకుడే మహిళ సంఘాల వీబీకే కావడంతో ప్రతీ నెలా 9వ తేదీన గ్రామంలో మహిళ సంఘాల సభ్యులు స్త్రీనిధి లో చెల్లించే డబ్బులు కొన్ని సంవత్సరాలుగా చెల్లించకుండా వాడుకుంటున్నారు. దీంతో సుమారు రూ.11లక్షల వరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఏపీఎం మహేశ్వరరావు తెలిపారు. పెండింగ్ ఉన్న ప్రతీ పైసా చెల్లించేంత వరకు తాళం తీసేది లేదని మహిళలు పట్టబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళలను, గ్రామస్థులకు నచ్చజెప్పారు. నిర్బంధంలో ఉన్న అధికారులను విడిపించారు. నిర్బంధంలో ఏపీఎం మహేశ్వరరావు, సీసీ అంజయ్య, వీబీకేలు ఉన్నారు.

నిందితుడికి ఏడాది జైలు

● రూ.2వేలు జరిమానా

కట్టంగూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కేసులో నిందితుడికి సంవత్సరం జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విదిస్తూ నకిరేకల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ అరిఫ్ సోమవారం తీర్పు ఇచ్చారు. కట్టంగూరు ఎస్ఐ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... 29 .04. 2016 తేదీన నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన వరికుప్పల నర్సింహ తన కుటుంబ సభ్యులతో కలిసి వివాహ నిశ్చితార్థ నిమిత్తం ఏపీ24డబ్ల్యూ5571నెంబర్ గల ఆటోలో రాములబండ నుంచి సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి వెళ్తుండగా కట్టంగూరు గ్రామంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికి అదే సమయంలో ఏపీ 28 బీసీ 9909 నెంబర్ గల ఇన్నోవా కారుడ్రైవర్ అతివేగంగా అతిజాగ్రత్తగా వచ్చి ఆటోను వెనక నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి ఎస్ఐ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నివేదికను నకిరేకల్ కోర్టులో ఫైల్ చేశారు. కేసు విచారణ అనంతరం ఈ సోమవారం నిందితుడైన కారు డ్రైవర్ సురుగు అశోక్‌కు ఏడాది జైలుశిక్ష రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పును ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

హైదరాబాద్ నిమ్స్‌కు వీల్‌చైర్ల బహూకరణ

నల్లగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం నాడు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి 20వీల్ చైర్లను డొనేట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతరలో డోలు వాయిస్తున్న మంత్రి ఉత్తమ్

మదెరపోలు, ముత్యాల పోలు, లగం పోలు నిర్వహిస్తున్న యాదవులు



మొక్కు తీర్చుకుంటున్న మహిళలు

లింగమంతుల స్వామిని దర్శించుకున్న పేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కుటుంబ సభ్యులు

జనమే జనం

కిక్కిరిసిన పెద్దగట్టు



పెద్దగట్టు వద్ద కిక్కిరిసిన జనం

సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు రెండో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. దారులన్నీ జనంతో నిండిపోయాయి. సుమారు ఆరు లక్షల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. సౌడమ్మ, యలమంచమ్మ దేవతలకు భక్తులు జీవాలను బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. మహిళలు గంపలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. దురాజ్‌పల్లి చుట్టు పక్కలా ఐదు కిలో మీటర్ల మేర భక్తులు గుడారాలు ఏర్పాటుచేసి వంట చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి బంధుమిత్రులతో కలిసి ఆరగించారు. కాగా, జాతరలో మూడో రోజు మంగళవారం ఉదయం చంద్ర పట్నం కార్యక్రమం నిర్వహించనున్నారు.

•6లో..



విద్యుత్ దీపాల వెలుగులో గుట్ట ఆలయ వైకుంఠ ద్వారం

యాదగిరీశునికి ఉత్సవ సంబరం

- రేపటి నుంచి 23 వరకు స్వర్ణ గోపుర ఉత్సవ పూజలు
- 23 నుంచి 28 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు
- రేపు స్వాతి నక్షత్రం, గిరిప్రదక్షిణ

•6లో..

కాషాయదళ అసమ్మతికి అధిష్ఠానం బ్రేక్

- వరుస ఆందోళనలతో ముఖ్యనేతలకు షాకిచ్చిన అసమ్మతివర్గం
- ఇకపై సమష్టి నిర్ణయాలతో ముందుకెళ్దామని నచ్చజెప్పిన సంస్థాగత ప్రధాన కార్యదర్శి
- పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు వచ్చాక సమీక్ష చేస్తారనే భరోసా
- పార్టీ శ్రేయస్సు దృష్ట్యా ఆందోళనలు నిలిపామంటున్న అసమ్మతినాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి నియామకంపై చెలరేగిన వివాదానికి అధిష్ఠానం తాత్కాలికంగా బ్రేక్‌వేసింది. అసమ్మతి వర్గం లేవనెత్తిన అంశాలపై తప్పకుండా న్యాయం చేస్తామని, సమష్టి నిర్ణయాలతోనే పార్టీని ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. అసమ్మతి నాయకులతో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ జరిపిన చర్చల అనంతరం ఈ మేరకు స్పష్టత వచ్చింది. ఏకపక్ష నిర్ణయాలతో కాకుండా సమష్టిగా నిర్ణయాలు తీసుకునేలా ప్రత్యేక యంత్రాంగాన్ని జిల్లా స్థా యిలో ఏర్పాటు చేస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో అసమ్మతివర్గం నిరసనలకు ఫుల్‌స్టాప్ పెట్టింది.

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డిని నియమించడంపై పార్టీలో తీవ్రదుమారం చెలరేగింది. ఆయన నియామకాన్ని వ్యతిరేకించిన అసమ్మతివర్గ నాయకులు నియామకాన్ని పునః సమీక్షించాలనే డిమాండ్‌తో ఆందోళనలు నిర్వహించి అధిష్ఠానానికి ఝలక్ ఇచ్చారు. ఈ సందర్భంగా అసమ్మతివర్గం కీలక అంశాలను లేవనెత్తింది. ఏడాది క్రితం పార్టీలో అంతవరకు ఎలాంటి క్రియాశీలక సభ్యత్వం లేకపోయినా, పార్టీలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎలాంటి పదవి నిర్వహించకపోయినా, వర్షిత్‌రెడ్డిని నేరుగా జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పార్టీ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాజాగా, సంస్థాగత ఎన్నికల్లోనూ పార్టీ జిల్లా అధ్యక్ష నియామకానికి రెండుసార్లు క్రియాశీలక సభ్యత్వంతో పాటు 45 ఏళ్ల పైబడి ఉండాలనే నిబంధన విధించారని, దీనికి విరుద్ధంగా వర్షిత్ ఎంపిక జరిగిందని ఆరోపించారు. ఏడాది క్రితం నుంచి అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న వర్షిత్‌రెడ్డి సీనియర్లు, క్యాడర్‌ను కలుపుకుపోవడం లేదని, ఏకపక్ష నిర్ణయాలతో వెళ్తున్నారంటూ ప్రధానంగా అసమ్మతివర్గం ఆరోపించింది. వర్షిత్ నియామకాన్ని పునః పరిశీలించాలనే డిమాండ్‌తో అధిష్ఠాన ముఖ్యులకు, ఇన్‌చార్జీలకు అంతర్గతంగా తెలియజేయడంతో పాటు బహిరంగంగా ప్రెస్‌మీట్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా నల్లగొండకు కేంద్ర మంత్రి బండి సంజయ్ వచ్చిన సందర్భంలో, పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహిస్తున్నప్పుడే కార్యాలయం ఎదుట నల్లకండువాలు, ప్లకార్డులతో అసమ్మతివర్గం నిరసన తెలిపింది. దీంతో పార్టీ ముఖ్యనేతలు ఆచారి, ప్రేమేందర్‌రెడ్డి ఈ విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేస్తామనే హామీతో ఆ రోజు నిరసనను విరమింపజేశారు. అసమ్మతివర్గ వరుస ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానవర్గం మధ్యేమార్గంగా సంధి ప్రయత్నాలు చేసి, అసమ్మతిని చల్లార్చింది.



నల్లగొండ బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అసమ్మతివర్గ నాయకులు (ఫైల్)

సమష్టి నిర్ణయాలతో ముందుకు

అసమ్మతివర్గ కార్యకలాపాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావించిన బీజేపీ రాష్ట్ర అధిష్ఠానం నాయకులను హైదరాబాద్‌కు పిలిపించి అభిప్రాయసేకరణ చేసింది. పార్టీ సంస్థాగత ప్రధాన

మిగతా 7వ పేజీలో...

రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న మూర్ఖులు



దామరచర్లలోని యాదాద్రి థర్మల్ ప్లాంట్ ఎదుట కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

దామరచర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అధికారంలోకి వచ్చిన మూర్ఖులు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని వీర్లపాలెం శివారులోని యాదాద్రి విద్యుత్ పరిశ్రమ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సంవత్సరం పాలనలో రాష్ట్రం రూ.15వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. విద్యుత్ కోతలు, వ్యవసాయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కులగణనలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమైక్యాంధ్ర పాలనలో అన్యాయం జరుగుతుందని, స్వరాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా 2001లో కేసీఆర్ పార్టీని స్థాపించి 14 ఏళ్లపాటు ఉద్యమం నడిపి రాష్ట్రాన్ని సాధించారన్నారు. రాష్ట్ర సాధన అనంతరం రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని కేసీఆర్ అంటే అన్ని వర్గాల ప్రజలు ఒప్పుకోలేదని, అభివృద్ధి, సంక్షేమం ఆయనతోనే సాధ్యమవుతుందని, తెచ్చిన తెలంగాణాను దొంగల చేతిలో పెడితే రాష్ట్రం నాశనం అవుతుందని ప్రజలు కోరడంతో ఆయన ఎన్నికల్లో పోటీ చేయగా బీఆర్ఎస్ గెలుపొందిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆరేళ్లలోనే ప్రపంచం నివ్వెరపోయేలా అభివృద్ధి చేసి చూపించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దన్నారు. ఉమ్మడి జిల్లాలో 2014లో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించగా 2020 నాటికి 40క్షల మెట్రిక్ టన్నులకు చేరిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి, దేశానికి కేసీఆర్ సేవలు అవసరమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అందుకే కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించడంతోపాటు దేశానికి వెలుగులు నింపే విద్యుత్ పరిశ్రమ ఎదుట ఆయన జన్మదిన వేడుకలను అధికార పార్టీకి కనువిప్పు కలిగించేలా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాయక్, తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, ఎండి.యూసుఫ్, హాతీరాంనాయక్, కొత్తా మర్రెడ్డి, కటికం సైదులు రెడ్డి, దారగాని వెంకటేశ్వర్లుగౌడ్, కోట్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి



'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీల పెంపకాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఎంసీవోలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి ముందుగా బ్యాగుల్లో మట్టి నింపడాన్ని పూర్తిచేయాలని, షేడ్ నెట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏ మొక్కలు ఎంత శాతం పెంచాలో ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రారంభించిన 31 పంచాయతీల మాదిరిగానే, మిగిలిన గ్రామాల్లో జాబితాల పరిశీలనను ఈనెల 20లోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోలు, ఎంఎస్‌వోలు ఈ జాబితాను పరిశీలించాలన్నారు. జాబితా పరిశీలనలో ఎట్టి తప్పు చేయవద్దని ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. 31 గ్రామాలకు సంబంధించి మొదటి జాబితాలో ఆమోదించిన జాబితాను తక్షణమే కలెక్టర్ లాగిన్‌కు పంపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో భాగంగా ముందుగా గుడిసెలు, పూర్తిగా కొత్తగా మార్కింగ్ ఇచ్చిన వాటిని మాత్రమే తీసుకోవాలని, చెల్లింపులు దశలవారీగా ఉంటాయని తెలిపారు. డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లా లో 69లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలి

'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి 25 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనుల మంజూరు, గ్రౌండింగ్, పురోగతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరం లేని చోట పనులు మంజూరైతే రద్దు చేయాలని, ప్రారంభించని చోట వెంటనే మొదలు పెట్టాలని అన్నారు. 'ప్రజావాణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు.



ఫిర్యాదులు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 35 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'డయల్ యువర్ సైబర్ నేస్తం' ద్వారా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన నలుగురు నేరుగా, ఆరుగురు ఫోన్‌కాల్ ద్వారా వారి సమస్యలు వివరించారన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930కి గానీ, సంబంధిత వెబ్‌సైట్‌లోగానీ ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకూ 'డయల్ యువర్‌సైబర్ నేస్తం' నిర్వహిస్తున్నామని, 8712658079 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కేసీఆర్‌ను మించిన ఘనుడు రేవంత్

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలు ఇవ్వడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను మించిన ఘనుడని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజలతో పాటు ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే బాగుండేదన్నారు. దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించిన ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ పాలనలో ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రాట్యూటీ, అలవెన్స్, పింఛన్ల కోసం పది శాతం కమీషన్ ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్‌సీ ఫండ్ విడుదల చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ అమలు చేయలేదన్నారు. నాణ్యతతో కూడిన విద్యనందించడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు విస్తరింపజేసిన ప్రధాని మోదీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అందుకే మహారాష్ట్ర, ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు సాదినేని శ్రీనివాసరావు, సైదిరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎడ్ల రమేష్, సునీతరెడ్డి, నివేదితరెడ్డి, అశోక్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ప్రతిభ చాటిన వీఎస్ఆర్ విద్యార్థికి బహుమతి ప్రదానం

హాలియా, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని వీఎస్ఆర్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బి.రోహిత్‌రెడ్డి సర్ సీవీరామన్ యంగ్ జీనియస్ అవార్డ్ పరీక్షలో ప్రతిభ చాటాడు. సుచీర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో రోహిత్‌రెడ్డి జిల్లా ప్రథమ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని నాంపల్లి లలితా కళాతోరణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రోహిత్‌రెడ్డికి మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికలతో పాటు నగదు బహుమతిన అందజేశారు.

భూమి లేని పేదలందరికీ రూ.12వేలు అందించాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా భూమి లేని పేదలందరికీ రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మికుల స్థితిగతులను తెలుసుకున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో సంఘం నాయకులు కావలి కృష్ణయ్య, కూలీలు కూర ఈదమ్మ, లక్ష్మయ్య, నారయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ పక్కదారి పడితే చర్యలు : డీటీ


పరీక్షిస్తున్న డీటీ

చింతపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు సమాచారం అందితే వారిపై కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ డీటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ర ఘునందన్ హెచ్చరించారు. చింతపల్లి మం డలంలోని మదనాపురం గ్రామంలో సోమవా రం రేషన్‌దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లందరూ అర్హులైన వారికి రేషన్ బియ్యం అందించాలని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అశ్రద్ధ వహించకుండా దుకాణాన్ని శుభ్రంగా ఉంచుకొని లబ్ధిదారులకు ప్రతీ నెలా బియ్యం అందించాలన్నారు. సాంకేతిక సమస్య వస్తే వెంటనే లబ్ధిదారులు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. బియ్యం తీసుకున్న వారికి తప్పకుండా రశీదు అందించాలని డీలర్లకు సూచించారు. అనంతరం మండలంలోని వెంకటేశ్వరనగర్‌లోని పలు పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ పోసే నాజిల్ గన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పూర్తయ్యేదెప్పుడో..?!

- సా...గుతున్న ఎత్తిపోతల పథకాల పనులు
- దేవరకొండ డివిజన్‌లో పెండింగ్ పనులు
- నిధుల కొరత, అటవీశాఖ నుంచి రాని అనుమతి
- సాగునీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని గుట్టలపై ఉన్న గ్రామాలకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలని 2021లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎత్తిపోతల పథకాల పనులకు శంకుస్థాపన చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ముంపునకు గురైన బాధితులు దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము, పీఏపల్లి, చందంపేట మండలాలలోని గుట్టలపై ఉన్న గ్రామాల్లో పునరావాసం ఉంటున్నారు. వర్షాధార పంటలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. గుట్టలపై ఉన్న గ్రామాల రైతులకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. నాగార్జునసాగర్ ఉపఎన్నిక హామీల్లో భాగంగా పొగిళ్ల, కంబాలపల్లి, అంబభవాని పెద్దమునిగల్, పెద్దగట్టు, ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టేందుకు రూ.585 కోట్లతో అనుమతులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. కానీ నిధుల కొరత, వర్షపు నీరు చేరుకోవడం, అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో ఎత్తిపోతల పథకం పనులు ఒకడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లు డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం పనులతో పాటు ఎత్తిపోతల పథకాల పనులు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిధులు కేటాయిస్తే పనులు వేగవంతంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. కంబాలపల్లి ఎత్తిపోతల పథకానికి రూ.202.15 కోట్లు కేటాయించారు. ఈ పథకం పనులు 20 శాతం పూర్తయ్యాయి. బిల్లు చెల్లించకపోవడం, వర్షపు నీరు చేరుకోవడంతో కాంట్రాక్టర్ ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే కంబాలపల్లి, పాతకంబాలపల్లి, గువ్వలగుట్ట, కాచరాజుపల్లి, యలమలమంద గ్రామాలకు సాగునీరు అందనుంది. 20 వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. అంబభవానీ ఎత్తిపోతల పథకానికి రూ. 181.55 కోట్లు కేటాయించారు. ఈ పథకం పనులు 30శాతం పూర్తయ్యాయి. వర్షపు నీరు చేరడం, చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఈ పథకం పూర్తయితే వైజాగ్‌కాలనీ, పెద్దమునిగల్, బుడ్డోనితండా, కేతేపల్లి, మొసంగితండా, గుర్రపుతండా, చిన్నమునిగల్, పేర్వాల గ్రామాలకు సాగునీరు అందనుంది. ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకానికి రూ.90.56 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం 40 శాతం పనులు పూర్తయ్యాయి. ఏకేబీఆర్ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే పీఏపల్లి, గుడిపల్లి, గుర్రంపోడు మండలాలలోని 6691ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి 82.727 కోట్లు కేటాయించారు. యల్లాపురం, లంబపురం, పెద్దగట్టు గ్రామాలలోని 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాని అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. పొగిళ్ల ఎత్తిపోతల పథకానికి రూ.24.64 కోట్లు కేటాయించారు. అటవీశాఖ అనుమతి రాకపోవడంతో ప్రాజెక్టు పనులు ప్రారంభంకాలేదు. అటవీశాఖ అనుమతులు, నిధుల కేటాయింపు, భూసేకరణ పూర్తయితే పనులు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టులపై దృష్టి సారించడంతో ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయిస్తారని ఆశాభావాన్ని ఆయకట్టు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తిపోతలు	మండలం	ఎకరాలు
పొగిళ్ల	చందంపేట	3019
కంబాలపల్లి	చందంపేట	20000
ఏకేబీఆర్	పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, గుర్రంపోడు	6700
అంబ భవాని	నేరేడుగొమ్ము	10000
పెద్దగట్టు	పెద్దఅడిశర్లపల్లి	5000

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

ఎత్తిపోతల పథకాలకు నిధుల కేటాయింపు విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. గతంలో కురిసిన వర్షాలకు వర్షపునీరు చేరుకోవడంతో ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయి. ఏకేబీఆర్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో అన్ని ఎత్తిపోతల పనులు పునఃప్రారంభంకానున్నాయి.

● శ్రీధర్‌రావు, ఈఈ


ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు, (ఇన్‌సెట్‌లో)నిలిచిపోయిన కంభాలపల్లి ఎత్తిపోతల పనులు

లిఫ్టులను వేగవంతంగా పూర్తి చేయాలి



లిఫ్టుల పథకం పనులకు నిధులు కేటాయించి వేగవంతంగా పూర్తి చేయాలి. ఎత్తిపోతల పనులు పూర్తయితే పీఏపల్లితో పాటు గుడిపల్లి, గుర్రంపోడు మండలాలలోని గ్రామాలకు సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

● నెర్మటి సీతరాంరెడ్డి, అంగడిపేట, పీఏపల్లి

సాగునీటి కోసం ఎదురు చూస్తున్నాం



గుట్టలపై ఉన్న గ్రామాలకు నీరు అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. సాగునీరు లేక వర్షాలపైనే ఆధారపడి పంటలు వేసుకొని జీవనం కొసాగిస్తున్నాం. సాగునీరు అందించి సమస్యను పరిష్కరించాలి.

● లింగాల రోశయ్య, రైతు పొగిళ్ల

కోరిన కోర్కెలు తీర్చే వీరభద్రస్వామి

- ఆలయ బ్రహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలునాయక్


బ్రహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కోరిన కోరికలు నెరవేర్చే దైవం ముదిగొండ కమలాపూర్ శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి అని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కమలాపూర్‌లో వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 26 నుంచి మార్చి 5వ తేదీ వరకు ముదిగొండ వీరభద్రస్వామి దేవాలయంలో బ్రహోత్సవాలు, జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ముదిగొండ మాజీ సర్పంచ్ సత్యం, తుమ్మలపల్లి నిరంజర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఫణింద్రశర్మ, నరియానాయక్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


సంతోష్‌కుమార్‌కు బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డు



సంతోష్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న సినీనటి భూమిక చావ్లా

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌వాసి పాతనబోయిన సంతోష్‌కుమార్‌కు తెలంగాణ బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డు దక్కింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం తగ్గించడానికి ఈబైక్‌లు ఎంతో మేలు చేస్తాయని ప్రచారం నిర్వహించారు. అంతేకాక రాష్ట్రంలో 100 ఈ బైక్ షోరూంలు స్థాపించి అత్యధికంగా బైక్‌లు విక్రయించారు. హైదరాబాద్‌లోని దిపార్క్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టైకూన్ మీడియా సమావేశంలో ఆయనకు బిజినెస్ ఇన్నోవేషన్ అవార్డును ప్రముఖ సినీ నటి భూమిక చావ్లా అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలను వాడటం వల్ల డబ్బు ఆదా చేసుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మహాసభలలో మాట్లాడుతున్న కొండేటి శ్రీను

హాలియా, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నిధులు విడుదల చేసే వరకు ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. హాలియాలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇస్తానన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాష్ట్రంలో రూ.8,350కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో నల్లగొండలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ మహాసభల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి జిల్లా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తు కార్యాచరణ తయారు చేయడం కోసం ఈ మహాసభలు వేదిక కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రవినాయక్, కోరే రమేష్, నల్లబెల్లి జగదీష్, బుడిగపాక వర్షిత్, నవీన్, సాయి కార్తీక్, శివ, చరణ్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

రాములు మృతి పార్టీకి తీరనిలోటు : సత్యం

వేములపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీపీఐలో కీలకంగా వ్యవహరించే పుట్టల రాములు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రానికి చెందిన పుట్టల రాములు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సోమవారం ఆయన మృతదేహానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పబ్బు వీరస్వామి, మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, సయ్యద్, లింగానాయక్, వల్లంపట్ల వెంకన్న, పరమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్
- ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


గుర్రంపోడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, గోపాల్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, ఎన్నికల హామీలను విస్మరించడంతో వ్యతిరేకత ప్రారంభమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని జిల్లాలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పెంచికల్ పహాడ్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మొక్కలు నాటి మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్, సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు పాల్గొన్నారు.

వేములపల్లి మండలంలోని శెట్టిపాలెంలో కట్టా మల్లేష్‌గౌడ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు.

చందంపేట మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బీఆర్ఎస్ మండల నాయకుడు జర్పుల లోక్యానాయక్ పండ్లు పంపిణీ చేశారు.

డిండి, కొండమల్లేపల్లి మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు నాయకుల ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌జీ, చంద్రమౌళినాయక్, లింగయ్యయాదవ్, జలీల్ పాల్గొన్నారు.

హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ బాపు అని అన్నారు. హాలియాలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జవ్వాజి వెంకటేశ్వర్లు, బొల్లం రవి, రవినాయక్, వడ్డే సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్)లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు.

త్రిపురారంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్, విద్యాసాగర్ రావు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, బీల్యానాయక్ కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీలో, పేదలకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలా ధ్యక్షుడు వల్లపురెడ్డి, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

గుర్రంపోడులో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు తపస్సు చేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, షోయబ్, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, బిక్షం, పద్మ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నవీన్

క్రీడలతో మానసిక ఉల్లాసం

- నాంపల్లి సీఐ నవీన్

చింతపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా ఉండవచ్చని నాంపల్లి సీఐ నవీన్ తెలిపారు. సోమవారం చింతపల్లిలో ఎంసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూరె రాములు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ. 50వేలు, రెండో బహుమతిగా రూ.30వేలు, మ్యాన్ ఆఫ్ ది సీరీస్ దాత పుల్కరం శేఖర్ విజయం సాధించిన వారికి రూ.3333 లను అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి ఎస్ఐ బిమనమోని యాదయ్య, క్రికెట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన కోదండపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద అడిశర్లపల్లి మండలంలోని కోదండపురం గ్రామంలో గల పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం రెండో తిరుపతిగా భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. త్రిదం డి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారు అలయమును దర్శించి మంగళశాసనములు చేసిన ఈ ఆలయంలో సోమవారం స్వామివారికి అధ్యయనోత్సవం, తోళ్లక్కంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గరుడసేవ, 19వ తేదీ తెల్లవారుజామున స్వామి వారి కల్యాణోత్సవం, 21న గజవాహనసేవ, రథోత్సవం, 22న శేషవాహన సేవ, 23న పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు ఆ లయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా కబడ్డీ, ఆర్కెస్ట్రా, కోలాటం, భజనలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి వాహనదారులకు, ప్ర యాణికులకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ పూజారి కోమండురి శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్, శ్రీరమణచార్యులు, వెంకట్‌రమణాచారి, సైదిరెడ్డి, ఇందిరా, లక్ష్మయ్య, భిక్షమయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో సోమవారం నిర్వహించిన దేవరకొండ 7వ డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యారంగ స మస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాల కు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నల్లగొం డ జిల్లా కేంద్రంలో ఈ నెల 19,20 తేదీల్లో నిర్వహించే జిల్లా వహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జల్లెల ఇద్ది రాములు, బుడిగ వెంకటేష్‌లతో పాటు 17మందిని ఎ న్నుకున్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, పొట్ల రాకేష్, జై చరణ్, యోగి, గణేష్ పాల్గొన్నారు.

దేవరకొండలో సైబర్ మోసం

- ఎస్ఐనని చెప్పి మీసేవ నిర్వాహకుడి నుంచి ఫోన్‌లో రూ.5వేలు కొట్టేంచుకొని టోకరా

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఎస్ఐనని చెప్పి రూ.5వేలు ఫోన్‌పే చేయించుకొని సైబర్ మోసానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.... పట్టణానికి చెందిన మీసేవ నిర్వాహకుడు జగపతిబాబుకు దేవరకొండ టౌన్ ఎస్ఐని మాట్లాడుతున్నాను. రూ.5వేలు ఫోన్‌పే చేయాలని చెప్పి ఫోన్ వచ్చింది. వెంటనే జగపతిబాబు అతని మాటలను నమ్మి వచ్చిన నెంబర్‌కు రూ.5వేలు ఫోన్‌పే చేశాడు. అమౌంట్ కట్ అవ్వగానే ఫోన్ నెంబర్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో మోసపోయానని గ్రహించిన జగపతిబాబు సోమవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మీసేవ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. పోలీసులు, ఎస్ఐ పేరుతో డబ్బులు వేయాలని ఎవరైనా కొత్త వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు వేయవద్దని సూచించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ పేర్కొన్నారు.

‘గురుకుల’ ఘటనపై కొనసాగుతున్న విచారణ

- సీసీ పుటేజ్‌లలో ఆకతాయి ఫొటో
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ కవిత

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణశివారు పెంచికల్‌పహాడ్ ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో ఆకతాయి హల్‌చల్ చేసిన ఘటనపై విచారణ కొనసాగుతూనే ఉంది. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు సోమవారం దేవరకొండ సీఐ నర్సింహులు పెంచికల్‌పహాడ్ బాలికల గురుకుల పాఠశాలకు చేరుకొని సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించారు. ఆకతాయి ప్రహరీగోడ దూకి లోనికి ప్రవేశించినట్లు కనిపించిందని సీఐ పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ఆకతాయి ఎవరనే దానిపై దర్యాప్తు చేసి కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు భద్రత చర్యలు చేపడుతామన్నారు. గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిత గురుకుల పాఠశాలలోకి గోడదూకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాల దేవరకొండ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. పాఠశాలలో భద్రత చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టాల్సి ఉంది. ఇద్దరు నైట్‌వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసి భద్రత చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతానికి ఒక్కరే నైట్‌వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో మహిళ వాచ్‌మన్ ఉండగా ఆమెను ఇటీవల వంట సెక్షన్‌కు మార్చారు. దీంతో నైట్ వాచ్‌మన్ ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగానే నైట్ మహిళ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గురుకుల పాఠశాలను సందర్శించి ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులతో సమావేశమై పూర్తి స్థాయిలో భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు. పాఠశాలలోకి గోడదూకి వచ్చిన ఆకతాయి ఎవరు అనేది దర్యాప్తు చేసి త్వరలో పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- కేసు నమోదు

దేవరకొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం తాటికోలు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పట్టుకొని సీజ్ చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. తాటికోలు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల డ్రైవర్లు రమావత్ బాలు, సైదులు, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


మృతి చెందిన భాస్కర్

గుర్రంపోడు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై యువరైతు మృతి చెందాడు. ఈ ప్రమాదం మండలంలోని ఆమలూరు గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం ఆమలూరు గ్రామానికి చెందిన గుంజ భాస్కర్ (34) అనే రైతు తనకున్న రెండెకరాల పొలంలో వరి సాగు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ వద్దకు వెళ్లి ఆన్ చేయగా మోటార్‌కు విద్యుత్ సప్లయి కాక ఆన్ కాలేదు. దీంతో ఫ్యూజ్‌లు తీసి మారుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలంలో కలుపు తీస్తున్న భార్య సునీత గమనించి వచ్చేలోపే మృతి చెందాడు. మృతుడు భాస్కర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు.